సాక్షి కర్నూలు

ఆదివారం । 5 । ఫిబ్రవరి । 2023



ఘనంగా లాలూస్వామి ఉరుసు

కృష్ణగిరి: చిట్యాల గ్రామంలో లాలూస్వామి ఉరుసు శనివారం ఘనంగా ప్రారంభమైంది. ఉదయం నుంచే దర్గాను భక్తులు దర్శించుకున్నారు. గంధం కార్యక్రమాన్ని నిర్వహించారు.



మూడో రోజు.. అదే జోరు

సాక్షి ప్రీమియర్ క్రికెట్ లీగ్ పోటీలు మూడో రోజు శనివారం హోరాహోరీగా సాగాయి. మ్యాచ్‌లను తిలకిస్తూ మైదానంలో క్రీడాభిమానులు సందడి చేశారు.

10లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,615.19
టీఎంసీల సామర్థ్యం	:105,788
ప్రస్తుతం	:48,868
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:000
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:8,890

న్యూస్‌రీల్

రేపు కలెక్టరేట్‌లో 'స్పందన'

కర్నూలు(సెంట్రల్): కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ఉదయం 10 నుంచి 2 గంటల వరకు ప్రజల నుంచి వినతులను స్వీకరించనున్నట్లు కలెక్టర్ పి.కోటేశ్వరరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతోపాటు అన్ని మండల, డివిజన్, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా స్పందన కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు.

పింఛన్ల పంపిణీకి నేటి వరకు అవకాశం

కర్నూలు(అగ్రికల్చర్): వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీకి ఆదివారం వరకు అధికారులు అవకాశం ఇచ్చారు. కర్నూలు జిల్లాలో 2,39,934 మంది లబ్ధిదారులు ఉండగా 2,36,351 మందికి, నంద్యాల జిల్లాలో 2,17,785 మందికి గాను 2,15,021 మందికి శనివారం సాయంత్రం నాటికి పింఛన్లు పంపిణీ చేశారు. పింఛన్ తిరస్కరించకుండా ఉండేందుకు వేలిముద్రలు, ఐరీస్ తీసుకుంటున్నారు. కొందరికి ముఖ నిర్ధారణతో పింఛన్లు పంపిణీ చేస్తున్నారు. పొలాల్లో ఉంటున్నా.. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నా..అక్కడికే వెళ్లి వలంటీర్లు పింఛన్లు అందజేస్తుండటంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి

- శాస్త్ర, సాంకేతికతను అందిపుచ్చుకోవాలి
- సరికొత్త ఆవిష్కరణల వైపు దృష్టిసారించాలి
- జిల్లా విద్యావైజ్ఞానిక ప్రదర్శనలో కలెక్టర్ కోటేశ్వరరావు
- రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు పలు ప్రాజెక్టులు ఎంపిక



ప్రాజెక్టులను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ కోటేశ్వరరావు, చిత్రంలో డీఈఓ రంగారెడ్డి



జిల్లా విద్యావైజ్ఞానిక ప్రదర్శనకు హాజరైన విద్యార్థులు, ఉపాధ్యాయులు

కర్నూలు సిటీ: వినూత్న ఆలోచనలతో విద్యార్థులు గొప్ప శాస్త్రవేత్తలుగా ఎదగాలని జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. శనివారం కర్నూలు ప్రభుత్వ(టౌన్ మోడల్)ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయి విద్యావైజ్ఞానిక ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనను జిల్లా కలెక్టర్ ప్రారంభించి ప్రసంగించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఇలాంటి ప్రదర్శనలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. శాస్త్ర, సాంకేతికను అందిపుచ్చుకుని సరికొత్త ఆవిష్కరణలు చేయాలన్నారు. ఆయా అంశాల పట్ల విద్యార్థులకు మక్కువ కలిగించేలా ఉపాధ్యాయులు స్థానిక వనరులను వినియోగించుకోవాలని సూచించారు. ప్రయోగాత్మకమైన రీతిలో బోధిస్తే విద్యార్థులు కొత్త విషయాలు తెలుసుకుంటారన్నారు. డీఈఓ రంగారెడ్డి మాట్లాడుతూ గతంలోఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది పాఠశాల స్థాయిలో విద్యావైజ్ఞానిక ప్రదర్శనలను నిర్వహించామన్నారు. వాటిలో ఉత్తమమైన ప్రాజెక్టులను ఎంపిక చేసి మండల స్థాయిలో ప్రదర్శించామన్నారు. మండల స్థాయిలో ప్రతిభ కనబరిచిన 125 ప్రాజెక్టులను జిల్లా స్థాయికి ఎంపిక చేశామన్నారు. జిల్లా స్థాయి ప్రదర్శనలో పలు ప్రాజెక్టులను జిల్లా కలెక్టర్ కోటేశ్వరరావు పరిశీలించి, విద్యార్థులను, ఉపాధ్యాయులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కర్నూలు నగరపాలక సంస్థ మేయర్ బీవై రామయ్య, సమగ్ర శిక్ష అదనపు కో ఆర్డినేటర్ డాక్టర్ కె వేణుగోపాల్, డిప్యూటీ ఈఓ హనుమంతరావు, డైట్ కాలేజీ ప్రిన్సిపాల్ జనార్దన్ రెడ్డి, కార్పొరేటర్ మౌనిక, కర్నూలు ఎంఈఓ వినోద్‌కుమార్, కల్లూరు ఎంఈఓ శ్రీనివాసులు, టౌన్ మోడల్ హైస్కూల్ హెచ్‌ఎం రాజకుమారి, సైన్స్ కో-ఆర్డినేటర్ రంగమ్మ, వివిధ స్కూళ్ల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపికైన ప్రాజెక్టుల వివరాలు..

- కంబాలపాడు, గోనెగండ్ల జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు జగన్, రవిచరణ్ తేజ తయారు చేసిన పక్షులను పారద్రోలే యంత్రం, బహుళ ఉపయోగ సాధనం
- కర్నూలు మున్సిపల్ హైస్కూల్, బురాన్‌దొడ్డి జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు హబీబా, డి. మురళీ తయారు చేసిన మురికినీటి శుద్ధి చేసే యంత్రం, ఆల్కాహాల్ డిటెక్టింగ్ ఇంజన్ లాకింగ్ సిస్టమ్
- తెర్నేకల్లు జెడ్పీ హైస్కూల్, షరీన్‌గన్ జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు అఖిల, వై రాణి తయారు చేసిన మలుపుల వద్ద ప్రమాదాల నివారణ, యూ సేఫ్ రోడ్డు ప్రాజెక్టులు
- కోసిగి మోడల్ స్కూల్, పత్తికొండ ఏపీఆర్ స్కూల్ విద్యార్థులు ఎ. ఉదయ్ హర్షిత, డి. సిరాజుద్దీన్ తయారు చేసిన బయోప్లాస్టిక్, మన పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం ప్రాజెక్టులు
- పెంచికలపాడు జెడ్పీ హైస్కూల్, ఆరెకల్లు ఏటీసీడబ్ల్యూ స్కూల్ విద్యార్థులు షాహీన్, బీ త్రివేణి తయారు చేసిన గణితాన్ని సులభంగా బోధించడం, రేఖలు, కోణాలు..గణిత శాస్త్ర నమూనాలు.

డిస్ట్రిక్ట్ వెబ్‌సైట్‌లో అర్హుల జాబితా

కర్నూలు(అర్బన్): బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి అర్హత సాధించిన, తిరస్కరణకు గురైన వారి వివరాలతో జాబితాలను తమ కార్యాలయం నోటీసు బోర్డు, డిస్ట్రిక్ట్ వెబ్‌సైట్‌లో ఉంచామని విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ శాఖ సహాయ సంచాలకులు పీ విజయ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్ -2 (హెచ్ హెచ్ జనరల్), ఆఫీసు సబార్డినేట్/ అటెండర్ (ఓహెచ్ జనరల్), ల్యాబ్ అటెండర్ (హెచ్ హెచ్ జనరల్), పీహెచ్ వర్కర్ (వీహెచ్ జనరల్) బ్యాక్ లాగ్ నాన్ - డీఎస్సీ పోస్టుల భర్తీకి గత ఏడాది అక్టోబర్ 23వ తేదీన నోటిఫికేషన్ ఇచ్చినట్లు తెలిపారు. జాబితాలపై ఏవైనా ఆక్షేపణలు ఉంటే ఈ నెల 10వ తేదీలోపు మెయిల్ ఐడీ addwknl@gmail.com కు తెలియజేయాలని పేర్కొన్నారు. అలాగే వినతులను నేరుగా లేదంటే పోస్టు ద్వారా కార్యాలయ పనివేళల్లో అందజేయాలని తెలిపారు.

క్లుప్తంగా

రూ. లక్ష విరాళం అందజేసిన పూర్వ విద్యార్థి


పూర్వవిద్యార్థి నాగేశ్వరరావు

పత్తికొండటౌన్: పత్తికొండ ప్రభుత్వ జూనియర్‌ కళాశాల పూర్వ(1977–79 ఇంటర్‌మీడియట్‌ బ్యాచ్‌) విద్యార్థి సి.నాగేశ్వరరావు పోలీసుశాఖలో పనిచేసి ఏఎస్‌ఐగా రిటైర్డు అయ్యారు. కళాశాలలో చదివే ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించేందుకు గాను తనవంతుగా రూ.1,00,813ల విరాళంగా అందజేసినట్లు పూర్వ విద్యార్థుల సంఘం కన్వీనర్‌ వీరేశప్ప శనివారం విలేకరులకు తెలిపారు. ఈ మొత్తాన్ని పోస్టాఫీసులో డిపాజిట్‌ చేసి వచ్చే వడ్డీని ప్రతి ఏటా కళాశాల టాపర్లుగా నిలిచే విద్యార్థులకు ప్రోత్సాహకంగా అందజేస్తామని ఆయన తెలిపారు. పూర్వవిద్యార్థుల సంఘం తరపున నాగేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు ఏపీజీఈఎఫ్‌ సభ

నంద్యాల(అర్బన్‌): స్థానిక టెక్కె మార్కెట్‌ యార్డులో ఆదివారం ఏపీజీఈఎఫ్‌ సభ నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి కర్నూలు జిల్లా ఏపీజీఈఎఫ్‌ చైర్మన్‌ రఘుబాబు, నంద్యాల జిల్లా చైర్మన్‌ భాస్కర్‌ తెలిపారు. స్థానిక కార్యాలయంలో శనివారం వారు మాట్లాడుతూ ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించే సభకు ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య రాష్ట్ర చైర్మన్‌ కాకర్ల వెంకటరామిరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరవపాల్‌ ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. శ్రీనివాస సెంటర్‌ నుంచి ర్యాలీ నిర్వహిస్తున్నామని, బహిరంగ సభకు ఉద్యోగులు తరలి వచ్చి జయప్రదం చేయాలని కోరారు.

ఐదుసార్లు గెలిపించినా ఏమీ సాధించలేదు

- ఉన్నత పదవులు పొంది ప్రజలను నట్టేట ముంచారు
- నియోజకవర్గ అభివృద్ధిని గాలికొదిలేశారు
- గత పాలకుల పనితీరుపై మంత్రి బుగ్గన మండిపాటు
- టీటీడీ కల్యాణ మండపాల నిర్మాణానికి భూమి పూజ
- హాజరైన టీటీడీ చైర్మన్‌ వైవీ సుబ్బారెడ్డి


గుండాలలోని పురాతన చెన్నకేశవ ఆలయం గురించి టీటీడీ చైర్మన్‌ వైవీ సుబ్బారెడ్డికి వివరిస్తున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి


టీటీడీ చైర్మన్‌ వైవీసుబ్బారెడ్డి, మంత్రి బుగ్గన, ఎంపీ పోచా, జెడ్పీ చైర్మన్‌ పాపిరెడ్డి, కలెక్టర్‌ మనజీర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

డోన్‌: 'డోన్‌ నియోజకవర్గం నుంచి ఓ పెద్దాయనను ఐదుసార్లు గెలిపించినా అభివృద్ధేమి చేయలేదు. డోన్‌ను రెవెన్యూ డివిజన్‌ చేస్తానని, 65 చెరువులకు నీళ్లు ఇస్తామని, సబ్‌కోర్టు, కల్యాణ మండపాల ఏర్పాటు చేస్తామని ప్రజలను నమ్మించి మోసం చేశారు. ఈ నియోజకవర్గం నుంచి గెలిచి ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి పదవులు పొందిన ప్రముఖులు కూడా ఎటువంటి శాశ్వత అభివృద్ధి పనులు చేపట్టలేదు. ప్రతిసారి ఊరేగింపుగా పెద్ద కాన్వాయ్‌తో రావడం, ప్రజలను వర్గాలుగా విడగొట్టి రెచ్చగొట్టడం చేశారే కాని.. ఈ ప్రాంత అభివృద్ధిని మాత్రం గాలికొదిలేశారు' అంటూ గత పాలకుల పనితీరుపై ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి మండిపడ్డారు. ఎస్‌. గుండాల, ఉడుములపాడు గ్రామాల్లో శనివారం టీటీడీ చైర్మన్‌ వైవీ సుబ్బారెడ్డి చేతుల మీదుగా రెండు టీటీడీ కల్యాణ మండపాల నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి బుగ్గన మాట్లాడుతూ రాష్ట్రంలో డోన్‌ను మోడల్‌ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు వంద పడకల ప్రభుత్వాసుపత్రి, నర్సింగ్‌ కళాశాల, బీసీ, ఎస్సీ, ఎస్టీ రెసిడెన్షియల్‌ స్కూల్స్‌, పాలిటెక్నిక్‌, ఐటీఐలో వసతిగృహాల ఏర్పాటు, వెటర్నరీ కళాశాల, గొర్రెల పెంపక శిక్షణ కేంద్రం, ప్రతి గ్రామానికి బీటీ రోడ్డు, ప్యాపిలిలో ఇంటిగ్రేటెడ్‌ మార్కెట్‌తో పాటు జ్యూష్‌ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. యువతకు ఉపాధి కల్పించేందుకు కొత్తకోట వద్ద డ్రైవింగ్‌ స్కూల్‌ ఏర్పాటు చేసి ఏటా 1,200 మందికి శిక్షణ ఇస్తున్నామన్నారు. అబ్బిరెడ్డిపల్లె చెరువును ఆధునికీకరించి బోటు షికారు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. వాల్మీకి గుహలను అభివృద్ధి చేసి పర్యాటకంగా తీర్చుదిద్దుతామన్నారు. అనంతరం స్థానిక ప్రముఖులకు టీటీడీ ప్రసాదాన్ని చైర్మన్‌ వైవీ సుబ్బారెడ్డి అందజేశారు.

గజమాలతో సత్కారం..

నియోజకవర్గంలో రెండు కల్యాణ మండపాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించిన టీటీడీ ఆలయ చైర్మన్‌ వైవీ సుబ్బారెడ్డితో పాటు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, జెడ్పీ చైర్మన్‌ ఎర్రబోతుల పాపిరెడ్డి, జిల్లా కలెక్టర్‌ డాక్టర్‌ మనజీర్‌ జిలానీ శామూన్‌ను ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ బద్దల రాజ్‌కుమార్‌, వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు బుగ్గన జయచంద్రారెడ్డి, బొబ్బల శివరామిరెడ్డి తదితరులు గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర మీట్‌ కార్పొరేషన్‌ చైర్మన్‌ శ్రీరాములు, గ్రామ పెద్దలు గిడ్డారెడ్డి, వెంకటయ్య, తిరుమలరెడ్డి, వైస్‌ ఎంపీపీ ఎర్రిస్వామి, సర్పంచులు రాధమ్మ, తేజోమణి భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీలు నీలమ్మ, ప్రభావతమ్మ, ఆర్‌డీఓ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

గూడూరు రూరల్‌: కె.నాగలాపురం పోలీసుస్టేషన్‌ పరిధిలోని నెరవాడ సమీపంలో శనివారం కారు–బైక్‌ ఢీ కొనడంతో చంద్ర(28)అనే వ్యక్తి మృతి చెందాడు. కోడుమూరు మండలం గోరంట్లకు చెందిన చంద్ర భార్య వెంకటేశ్వరమ్మతో కలసి కె.నాగలాపురం మీదుగా కర్నూలుకు పని నిమిత్తం బైక్‌పై వెళ్తున్నాడు. హైదరాబాద్‌కు చెందిన పళనిస్వామి కారులో భార్యతో కలిసి కర్నూలు మీదుగా మంత్రాలయానికి వస్తున్నాడు. నెరవాడ సమీపంలో ఎదురుగా వస్తున్న కారు, బైక్‌ ఢీ కొన్నాయి. దీంతో తీవ్రంగా గాయపడిన చంద్ర అక్కడికక్కడే మృతి చెందగా భార్య వెంకటేశ్వరమ్మ తీవ్ర గాయాల పాలుకావడంతో చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్‌ఐ సోమ్లానాయక్‌ తెలిపారు.

డీఎడ్‌ థర్డ్‌ సెమిస్టర్‌ ఫలితాలు విడుదల

కర్నూలు సిటీ: డీఎడ్‌ (2019–21 బ్యాచ్‌కి చెందిన విద్యార్థుల) థర్డ్‌ సెమిస్టర్‌ ఫలితాలు విడుదల చేసినట్లు డీఈఓ డాక్టర్‌ వీ రంగారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలకు హాజరు అయిన వారి మార్కుల జాబితాలను పరీక్షల విభాగం వెబ్‌సైట్‌ నుంచి డౌన్లోడ్‌ చేసుకోవాలని డీఈఓ సూచించారు. రీకౌంటింగ్‌కు ఈ నెల 1వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

జిల్లా ఒలింపిక్‌ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక


నూతనంగా ఎన్నికైన జిల్లా ఒలింపిక్‌ సంఘం సభ్యులను సత్కరించిన దృశ్యం

కర్నూలు (టౌన్‌): జిల్లా ఒలింపిక్‌ సంఘం నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. కర్నూలులోని గాయత్రీ ఎస్టేట్‌ రాగమయూరి కాన్ఫరెన్స్‌ హాలులో ఎన్నికలు నిర్వహించారు. మొత్తం 34 క్రీడా సంఘాల సభ్యులు పాల్గొన్నారు. జిల్లా ఒలింపిక్‌ సంఘం అధ్యక్షుడిగా రామాంజనేయులు, కార్యదర్శిగా అహ్మద్‌ షరీఫ్‌, కోశాధికారిగా గుడిపల్లె సురేందర్‌, ఉపాధ్యక్షులుగా నాగేశ్వరబాబు, సూర్యచంద్ర, కోలా ప్రతాప్‌, డాక్టర్‌ మోహన్‌రావు, షేక్షావలీ, సంయుక్త కార్యదర్శులుగా రామచంద్రనాయక్‌, చంద్రమౌళి, ప్రసాద్‌, విజయ్‌ ఎన్నికయ్యారు.

నూతన అధ్యక్షుడికి షోకాజ్‌ నోటీసులు

నూతనంగా ఎన్నికైన జిల్లా ఒలింపిక్‌ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులుకు రాష్ట్ర ఒలింపిక్‌ సంఘం కార్యదర్శి పురుషోత్తం శనివారం షోకాజ్‌ నోటీసులు జారీ చేశారు. రెండు వారాల వ్యవధిలో లిఖిత పూర్వకంగా జవాబు ఇవ్వాలని నోటీసుల్లో పేర్కొన్నారు. తమను సంప్రదించకుండా సొంతంగా జిల్లా ఒలింపిక్‌ సంఘం ఏర్పాటు చేసుకున్నట్లు తమకు తెలిసిందన్నారు. జాతీయ ఒలింపిక్‌ సంఘం సభ్యునిగా కొనసాగుతూ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారని పేర్కొన్నారు.

ఆన్‌లైన్‌లో బిల్డింగ్‌ ప్లాన్‌ అప్రూవల్‌

- కూడా చైర్మన్‌ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి


మాట్లాడుతున్న కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి

కర్నూలు(సెంట్రల్‌): బిల్డింగ్స్‌ ప్లాన్స్‌ను ఆన్‌లైన్‌ ద్వారా అప్రూవల్‌ చేయాలని గ్రామ, వార్డుసచివాయల ఉద్యోగులకు కుడా (కర్నూలు అర్బన్‌ డెవలప్‌మెంట్‌ అథారిటీ) చైర్మన్‌ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి సూచించారు. శనివారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటరియంలో గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేసే పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా కుడా చైర్మన్‌ మాట్లాడుతూ.. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో కుడా 1,5400 కిలోమీటర్ల పరిధి విస్తరించి ఉందన్నారు. నిబంధనలు పాటిసేస్త ఆయా పంచాయతీ, నగర పాలక, మునిసిపల్‌, కార్పొరేషన్‌ సంస్థలకు ఆదాయాలు సమకూరుతాయన్నారు. నిబంధనలు ప్రకారం ఉంటేనే బిల్డింగ్‌ ప్లాన్స్‌ను ఆమోదించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సైతం పార్కులు నిర్మించి అభివృద్ధి పథంవైపు నడిపించాలన్నారు. కర్నూలు మునిసిపల్‌ కమిషనర్‌ భార్గవ్‌తేజ మాట్లాడుతూ.. ప్లాన్‌లో రోడ్లు, డ్రెయినేజీలు, పార్కింగ్‌ ప్రదేశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కొత్త వెంచర్లు, పాత వెంచర్లలో అక్రమాలను నివారించేందుకు నిబంధనలు ప్రకారం పనిచేయాలన్నారు. కార్యక్రమంలో కుడా పీఓలు విజయ భాస్కర్‌, సంధ్య పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ప్రత్యేక గుర్తింపు


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జిల్లా కలెక్టర్‌ పి.కోటేశ్వరరావు

కర్నూలు(టౌన్‌): క్రీడల్లో రాణిస్తే ఎన్నో అవకాశాలతో పాటు ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని జిల్లా కలెక్టర్‌ పి.కోటేశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక జొహరాపురం రోడ్డులోని మైపర్‌ టెన్నిస్‌ అకాడమీలో థెరిసమ్మ జ్ఞాపకార్థం రాయలసీమ జోన్‌ టెన్నిస్‌ టోర్నమెంటు నిర్వహించారు. వైఎస్‌ఆర్‌ కాంగ్రెస్‌ పార్టీ మాజీ నగర అధ్యక్షులు రాజా విష్ణువర్ధన్‌ రెడ్డి స్పాన్సర్‌గా వ్యవహరించారు. రాయలసీమ పరిధిలోని కర్నూలు, నంద్యాల, అనంతపురం, వైఎస్సార్‌, చిత్తూరు జిల్లాల నుంచి 50 మంది టెన్నిస్‌ క్రీడాకారులు పాల్గొన్నారు. అండర్‌–10, అండర్‌–12 అండర్‌–14 అండర్‌–16 విభాగాల్లో బాల బాలికలకు ఈ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్‌ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. ప్రస్తుత సమాజంలో క్రీడలకు ఎంతో ప్రాధాన్యత పెరిగిందన్నారు. వ్యక్తిగతంగా రాణించే క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. గెలుపోటములు సహజమని, ప్రతి ఒక్కరూ క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలన్నారు. మైపర్‌ సంస్థల అధినేత ఆదిమూలపు సతీష్‌ మాట్లాడుతూ కర్నూలు నగరంలో గత 5 ఏళ్లుగా టెన్నిస్‌ టోర్నమెంట్లు లేవన్నారు. ఔత్సాహిక టెన్నిస్‌ క్రీడాకారులు ఉన్నా సరైన వేదిక లేనందున తమ అకాడమీ తరఫున రాయలసీమ స్థాయి టెన్నిస్‌ టోర్నమెంటు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి శాప్‌ (స్పోర్ట్స్‌ అథారిటీ ఆఫ్‌ ఆంధ్రప్రదేశ్‌) తరఫున పెద్ద ఎత్తున క్రీడలను నిర్వహిస్తున్నారన్నారు. అనంతరం కలెక్టర్‌ టెన్నిస్‌ టోర్నమెంటులో టాస్‌ వేసి పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో మైపర్‌ టెన్నిస్‌ అకాడమీ మేనేజర్‌ రామసుబ్బారెడ్డి, చీఫ్‌ కోచ్‌ షేక్‌ మహమ్మద్‌ రఫీ, ముప్ప రాజశేఖర్‌, ఆర్గనైజర్‌ చంద్రశేఖర్‌ తదితరులు పాల్గొన్నారు.

విజేతల వివరాలు

- అండర్‌–10 బాలుర విభాగంలో రామ్‌ధీరజ్‌ 6–1 స్కోర్‌తో సాయి సుజయ్‌పై.. వచన్‌ 6–1 స్కోర్‌తో రోహిత్‌పై విజయం సాధించారు.
- మహిళల సింగిల్స్‌ విభాగంలో ఆర్షియా 6–3 స్కోర్‌ చేసి జాస్మిన్‌పై విజయం సాధించింది.
- అలాగే అండర్‌–16 విభాగంలో జాస్మిన్‌ విన్నర్స్‌ షేక్‌ ఆర్షియా రన్నర్స్‌గా నిలిచారు.
- విన్నర్స్‌, రన్నర్స్‌కు నిర్వాహకులు ట్రోఫీ, విన్నర్స్‌కు రూ.2 వేలు రన్నర్స్‌కు ,రూ.వెయ్యి నగదు బహుమతులు అందజేశారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

- ఆరుగురి అరెస్ట్‌

వెల్దుర్తి: స్థానిక ఎల్లమ్మ గుడి వద్ద శనివారం కర్ణాటక రాష్ట్రానికి చెందిన 75 మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్‌ రెడ్డి తెలిపారు. కర్ణాటక మద్యం విక్రయిస్తున్న వెల్దుర్తి పట్టణానికి చెందిన రామకృష్ణ, జమ్మన్న, రామానాయుడు, పరమేష్‌, మద్దిలేటి, వెంకటేశ్వర్లును అరెస్ట్‌ చేసినట్లు చెప్పారు.

టిడ్కో ఇళ్లకు రూ.450కే విద్యుత్‌ కనెక్షన్‌

కర్నూలు(రాజ్‌విహార్‌): టిడ్కో ఇళ్లకు రూ.450కే విద్యుత్‌ కనెక్షన్‌ ఇస్తున్నట్లు దక్షిణ ప్రాంత విద్యుత్‌ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్‌ ఎస్‌ఈ ఎం. ఉమాపతి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సాధారణంగా 2కిలో వాట్స్‌ లోడ్‌ విద్యుత్‌ కనెక్షన్‌కు డెవలప్‌మెంట్‌ చార్జీల కింద రూ.3,950 చెల్లించాల్సి ఉంటుందని, అయితే ప్రభుత్వం దీనిని భారీగా తగ్గించిందన్నారు. సెక్యూరిటీ డిపాజిట్‌ కింద రూ.400, దరఖాస్తు ఫీజు రూ.50 కలిపి మొత్తం రూ.450 చెల్లిస్తే సరిపోతుందన్నారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 29,516 ఇళ్లకు విద్యుత్‌ కనెక్షన్‌ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఇళ్ల కేటాయిస్తూ ఇచ్చిన ఆర్డర్‌ కాపీ, ఆధార్‌ కార్డు తీసుకెళ్లి సచివాలయాలు, మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విద్యుత్‌ కనెక్షన్‌ కోసం దళారులు, విద్యుత్‌ సిబ్బందికి ఒక్క రూపాయి అదనంగా చెల్లించాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు.